ఇదీ అదేనా ?

రఘురామ్ ఆ రోజు ఆఫీసులో కూర్చోలేక స్కూటర్‌మీద ఇంటికి వచ్చి బజర్ నొక్కాడు. కాని తలుపు తెరుచుకోలేదు.

అతడికి తలనొప్పి విపరీతంగా వచ్చి అక్కడే ఒక మాత్ర వేసుకుని కాఫీ తెప్పించుకుని తాగాడు. కాని-కుర్చీమీద కూర్చోలేక ఆఫీసరుకు చెప్పి ఇంటికి వచ్చాడు.

ఎంతసేపటికీ తలుపుతెరుచుకోకపోతే విసుగుపుట్టి ఇటూ అటూ చూశాడు. అది మూడవ ఫ్లోరు ఫ్లాట్. అందరూ తలుపులు మూసుకుంటారు కాని తెరిచిపెట్టు కోరు. అతడికి ఆకస్మాత్తుగా మనసుకు తట్టింది-తన దగ్గర ఒక డూప్లికేటు తాళం చెవి జేబులో ఉండాలని. వెంటనే తలుపు తెరుచుకొని మళ్ళీ లాక్‌చేసి మంచం మీద వాలిపోయాడు. కొంతసేపటికి నిద్రకూడా పట్టింది.

అతడు మామూలుగా ఐదున్నర లేక ఆరు గంటలకు ఇంటికి వస్తాడు. కాఫీ తాగి టీ.వి. చూస్తూ కబుర్లు చెప్పుకుంటూ ఎనిమిది గంటలకు భోజనం చేస్తారు రఘురామ్, ప్రతిమలు.

అందుకే ప్రతిమ షిఫాన్‌చీరె కట్టుకుని, పర్సు ఊపుకుంటూ వచ్చి తలుపు తాళం తీసింది. తలవంచుకునే డ్రెస్సింగ్ రూములోకి వెళ్ళి చీరెమార్చుకుని కాఫీ తయారుచేయటానికి వంటయింట్లోకి వెళ్ళింది. కాఫీ తయారవుతుండగా రాత్రి వంటకు కూరలు తరిగిపెట్టుకుంది.

చేతి గడియారం చూసుకుంటే ఐదున్నర దాటింది. ఇంక రఘు వస్తాడను కుంటూ బెడ్‌రూమ్‌లోకి వచ్చిన ప్రతిమ పక్కమీద పడుకున్న రఘును చూసి తెల్లబోయింది.

ఎప్పుడు వచ్చాడు ? రాగానే పడుకోవటమేమిటి ?

అతడిని లేపింది. కళ్లు నలుపుకుంటూ లేచాడు.

"టైమెంత ?"

''మీ చేతి గడియారం ఉందిగా ? ఆరు గంటలయింది. ఇంకా యింటికి రాలేదేమో అనుకుంటున్నాను.''

''నేను రెండు గంటలకే ఇంటికి వచ్చాను."

''నేను ఫస్టుఫ్లోరులో కుసుమ వచ్చి పిలిస్తే వెళ్లాను. అప్పటికి ఒకటిన్నర.''

''నాకు తల నొప్పిగా ఉంటే సెలవు పెట్టి వచ్చేశాను. ఫాను వేసుకున్నాను, నిద్రపట్టింది."

''కాఫీతాగండి. బడలికపోతుంది."

ఇద్దరు బల్ల దగ్గరికి వెళ్ళి రెండు బిస్కెట్లతో కాఫీ తాగారు. భోజనాల తరువాత హిందీ కథ చూపించారు టీ.వి.లో కట్నాలమీద. ఆఫీసులో ఐదువేలు డిపాజిట్ కట్టాలని కథా నాయకుడు తండ్రిని అడుగుతాడు. కట్నం బాపతు డబ్బు మామగారిని అడగమని తండ్రి సలహాయిస్తాడు. మా నాన్న యిచ్చేస్థితిలో లేదని భార్య అనగానే తల్లిదండ్రుల ప్రోద్బలంతో కథానాయకుడు భార్యమీద కిరోసిన్‌పోసి అగ్గిపుల్ల గీస్తాడు.

''అబ్బబ్బ, ఎప్పుడు టీవీ పెట్టినా ఇవే నాటకాలు. పేపరు తెరిస్తే ఇవే కథలు-ఇవే వార్తలు. విసుగుపుడుతోంది''. అతడు టీవీని మూసేసి మళ్ళీ పక్కమీద వాలిపోయాడు.

ఇది జరిగి వారం రోజులయిందో లేదో ఒకనాడు రఘు ఇంటికి వచ్చాడు. ఆనాడు ఫైల్సు యింటికి తీసుకువచ్చాడు. ఆఫీసులో పనికావటంలేదు. ఎప్పుడూ ఎవరో విజిటర్సు ఎద్దడి. ఫైల్సు మూసి మాట్లాడి పంపించటంతో అవి తరగటం లేదు.

ప్రతిమ ఇంట్లో లేనట్టుంది. డూప్లికేట్‌తో తలుపు తెరుచుకొని లోపలికి వెళ్లాడు. వాటిని బల్లమీద పడేసి, కాఫీ కలుపుకుని తాగాడు. కిటికీలోనుంచి చల్లటి గాలి వీస్తోంది. ఫైల్సు చూసుకుంటున్నాడు.

ఆనాడు ప్రతిమకు ఆరు గంటలయింది యింటికి రావడానికి. గబగబా తలుపు తీసింది. ఎదురుగా ఫైల్సు చూసుకుంటూ రఘు కనబడ్డాడు.

మాట్లాడకుండా వంట యింట్లోకి వెళ్ళి ఖాళీ కాఫీకప్పు చూసినా, మళ్ళీ కాఫీ కప్పుతో వచ్చి "తీసుకోండి'' అన్నది.

అతడు మాట్లాడకుండా తీసుకున్నాడు. ఆమె కూడ మాట్లాడకుండానే లోనికి వెళ్ళిపోయింది.

ప్రతిమకు పక్క బిల్డింగులో ఉన్న కల్పనతో అనుకోకుండ స్నేహ మయింది. మొదట ప్రతిమయింటికి కల్పన తన అన్న రమేష్‌తో టెలిఫోనుకోసం వచ్చింది. అతడు మొహమాట పడుతూనే టెలిఫోను చేసుకున్నాడు. అలా మూడు నాలుగు సార్లు టెలిఫోన్లు చేసుకుని ఆమెను తమ యింటికి రమ్మని పిలిచారు. వాళ్ళకూ, ప్రతిమకూ అనుకూలమైన సమయం మధ్యాహ్నం పన్నెండు నుంచి నాలుగు గంటల వరకు. మొదట కబుర్లతో ప్రారంభమైన సమావేశం క్రమంగా పేకముక్కలాటగా మారింది. ముగ్గురితో ప్రారంభమైన పార్టీ ఐదూ, ఆరూమంది వరకూ పెరిగింది. అందులో ఇద్దరు మగవాళ్ళు రమేష్ కాక.

"అబ్బ. ఆట విసుగుపుట్టకుండా వుండాలంటే మధ్యమధ్య స్నాకూ్స, డ్రింకూ్స వుండాలి'' అన్నాడు మహేంద్ర.

ఒక రోజు రమేష్ తెప్పించాడు. రెండో రోజున మహేంద్ర తీసుకునే వచ్చాడు. మూడవ అతడు పాపం పర్సులేనివాడు. స్నాకూ్స, డ్రింకూ్స బిల్లు క్రమంగా ముప్పైనుంచి ఏభయికి పెరిగింది.

''ఆడవాళ్ల కభ్యంతరమయితే తీసుకోకండి" అన్నాడు మహేంద్ర ఒక విధంగా ప్రోత్సహిస్తున్నట్టూ రెచ్చగొట్టుతున్నట్టుగా.

ఆ మాట అత డనగానే ముగ్గు రాడవాళ్లకూ రోషం వచ్చింది. "మేమేం తక్కువ ? మేమూ మీతో సమానంగా తీసుకోగలం'' అంటూ పోటీపడ్డారు.

ఒకరోజు మహేంద్ర "డబ్బుపెట్టి ఆడితే మజాగాని, ఇదీ ఒక ఆటేనా ? చప్పగావుంది'' అన్నాడు.

''పాపం. ఆడవాళ్ళను వదిలిపెట్టరా ?" మూడవ అతను.

"మేమేమంత డబ్బులేకుండా ఏడుస్తున్నామా ?" అన్నారు మహిళామణులు.

"మాకూ స్వాతంత్ర్యం వుంది. మా కిష్టంవచ్చిన ఖర్చులు మేమూ పెట్టుకోగలం'' అన్నారు.

అప్పటి నుంచే ఆట రంజుగా సాగుతూ వచ్చింది. ఏమీ తోచదంటూ విసుక్కునే ప్రతిమలో కూడా ఉత్సాహం పొంగులు వారుతున్నది. చాలా సంతోషంగా వుంటోంది. రఘురామ్ ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తే ఇదివరలో కోపగించుకునేది. ఇప్పుడు ఆలస్యంగా వస్తే బాగుండుననుకుంటోంది.

అక్కడికి మూడు ఫర్లాంగుల దూరంలో ఒక కాంటీను వుంది. ఆ కాంటీను అన్నిరకాల డ్రింక్సు, టిఫిన్లూ, భోజనాలూ కూడా సప్లై చేస్తుంది. చీటీరాసి పంపిస్తే క్యాంటీను బాయ్ తీసుకువస్తాడు.

రోజులు ఆనందపారవశ్యంలో గడుస్తున్నాయి. ముగ్గురు మహిళామణులు కూడా బిల్లును పంచుకుంటున్నారు.

ప్రతిమ తనకు యింటి ఖర్చులకోసం రఘురామ్ యిచ్చిన డబ్బులో ఇటుదటూ అటుదిటూ సర్ది బిల్లులు కడుతోంది. నలుగురిలో చిన్నతనమనిపించుకోవటం ఆమె కిష్టంలేదు. ఇంటి ఖర్చులతోపాటు ఈ పై ఖర్చులు ఆట ఓడిపోవటాలతో ఎక్కువయ్యాయి. ఒకసారి వేలి వుంగరం, మరొకసారి చేతిగాజు, ఇప్పుడు ప్రాణమ్మీదికి వచ్చింది బిల్లు ఏది అమ్మాలి ? మెడలో నల్లపూసల హారమా ?

ఆమె కెటూ తోచటంలేదు. అందులో మరొక బాధ, చెందేరి చీరలవాడు డబ్బుకోసం వస్తున్నాడు ఇచ్చేటప్పుడు బ్రతిమిలాడి "ఉన్నప్పుడే యివ్వండి'' అంటూ యిచ్చిపోయాడు. ఇప్పుడు ప్రతిరోజూ వస్తున్నాడు డబ్బుకోసం.

ఏం చెయ్యాలి ?

పార్టీకి వెళ్ళకుండా వుంటే ? అమాట అనటానికి తనకే అవమానం. ఒకవేళ ధైర్యం తెచ్చుకుని అన్నా, బాకీలు చెల్లించి వెళ్లమంటారు. అదింకా అవమానకరం.

ఆమెకు పార్టీలో కూర్చున్నంతసేపూ ఉత్సాహంగా ఉన్నట్టే వుంటుంది. కాని ఇంటికి వచ్చిన తరువాత ఎక్కడలేని భయమూ పుట్టుకొస్తోంది.

రఘురామ్ మామూలుగా ఆఫీసు ఫైల్సు చూసుకోవటమూ, తన రొటీన్ ప్రకారం ఆఫీసుకు వెళ్లటం. ఇంటికి రావటమూ. ఎప్పుడైనా భార్యను తీసుకుని పిక్చరుకెళ్ళటమూ, అంతే.

ప్రతిమకు పార్టీలో ఎత్తిపొడుపులు ఎక్కువైనాయి.

"ఏమండీ మీవారు ఏమయినా బాధపెడుతున్నారా? ఏమిటండీ- ఈరోజుల్లో కూడా భర్తలకు భయపడటమేమిటండీ?? అయినా చూడండి. విదేశాలలో స్త్రీలు యింటిపని చేసినందుకు జీతాలడుగుతున్నారు. మీరు చేసే పనికి ఎంతజీతమిచ్చినా చాలదు. మీరు ధైర్యం తెచ్చుకోవాలి."

అసలే రోషముగల ప్రతిమకు ఆ మాటలు రోజూ వింటుంటే నిజమనిపించటం మొదలుపెట్టింది.

ఆ నెలలో అతడు ఇంటి ఖర్చులకని ఇచ్చిన డబ్బుతో చెందేరి చీరెలవాడికి సగం బిల్లు చెల్లించింది. కొంతవరకూ క్యాంటీన్ బిల్లు చెల్లించింది. ఇప్పుడు క్యాంటీనుబాయ్ బిల్లు కోసం తిరుగుతున్నాడు. అప్పటికా గండం గడిస్తే చాలని రెండు రోజుల తరువాత రమ్మనమంది.

రెండు గంటలకు మామూలుగా రఘురామ్ ఇంటికి వచ్చేసరికి ప్రతిమ లేదు. తాళం తీసుకుని లోపలికి వెళ్ళి గ్లాసెడు మంచినీళ్లు తాగాడు. ఎందుకో ఆనాడతడికి వక్కపొడి వేసుకోవాలనిపించింది. అల్మేరాతెరిచి వక్కపొడి నోట్లో వేసుకుని ఆ డబ్బాకింద ఉన్న కాగితం ఏమిటని చూశాడు.

ఆ బిల్లు ప్రతిమారామ్ పేరుమీద ఉంది.

సోడా బుడ్లు, స్నాక్సు, బీర్‌బాటిల్స్ మొదలైనవాటి బిల్లు ఫిబ్రవరి నెలలో రు. 200/-లు. ఫ్లాట్ నెం. పేరు సరిగానే ఉన్నాయి. ఈ బిల్లు ప్రతిమకా ?

అతడికి కంపరమెత్తినట్లుగా ఉంది ఆ బిల్లు చూడగానే.

ఇది నిజమా ?

ప్రతిమ బీర్‌కు అలవాటుపడిందా ?

ఒంటరిగానా ? ఎవరితోనయినానా ?

ఎంతకాలం నుంచి ?

డబ్బు ఎక్కడిది ?

సరిగ్గా మామూలుగా వచ్చే వేళకే ప్రతిమ వచ్చింది. మామూలుగా అతడిని పలకరించింది. కాఫీతో పాటు టిఫిన్ చేసి పిలిచింది.

మాట్లాడకుండా పెట్టింది తిని మళ్ళీ బల్లదగ్గరకొచ్చి కూర్చున్నాడు. రఘురామ్.

అతడి మౌనం చూసి ఆమెకు అనుమానం వచ్చింది.

"ఎంతసేపు చూస్తారు ఫైళ్ళు ? విసుగు పుట్టటంలేదూ ? చూసే వాళ్ళకే విసుగ్గా ఉంది ?''

''విసుగా ? విసుగు పుడితే ఎలా ? జీతం రావాలా ఖర్చులకు ?

"అందరూ ఇలాగే చేస్తారా ?"

"అందరి చేతలకూ నేను జవాబులు చెప్పగలనా ? మన యింట్లో జరిగే వాటికే జవాబు చెప్పలేకుండా ఉన్నానుగాని, ఇంక బయటివాళ్ల సంగతా ?"

''మనింటి సంగతా ? ఏమిటది ?"

"ఏమిటా ? అల్మేరాలో వక్కపొడి డబ్బాక్రింద ఉన్న బిల్లుకు నేను జవాబు చెప్పగలనా ? ఇంట్లో ఇంకా ఏమేమి జరుగుతున్నాయో నేను చెప్పగలనా ?''

ప్రతిమ అపరాధిలా నిలబడదలచుకోలేదు.

''అవును క్యాంటీను బిల్లు వచ్చింది.''

"చెల్లించావా ?''

''ఎలాగో చెల్లిస్తాను."

"డబ్బు"

"నా కిచ్చిన దాంట్లో ఖర్చు పెడతాను. ఆమాత్రము స్వాతంత్ర్యం లేదా?"

"అసలు ఆ బిల్లు ఎక్కడిది ? ఎప్పడిది ? సందర్భం ఏమిటి ?"

నిలదీసి అడిగేటప్పటికి ప్రతిమ అహం దెబ్బతిన్నది. మరి ఆగలేక పోయింది.

''ఎక్కడిదయినా, ఎప్పటిదయినా, ఏ సందర్భమయినా, ఆ బిల్లు నాదే. నేను చెల్లించాల్సిందే."

"అంటే నీ దగ్గర డబ్బేది ? ఇంటి ఖర్చులకే కదా నేనిచ్చింది ?"

''ఇంకా అడుగుతాను. మీరిచ్చితీరాలి.''

"నేను చాలా బిల్సు కట్టాలి. నీవడిగినా నా దగ్గర డబ్బు లేదు."

''డబ్బెందుకు లేదు ? పది వేల కట్నం తీసుకున్నవాళ్ళు కూడా యిట్లాగే మాట్లాడతారా ? భార్య డబ్బడిగితే ఇవ్వనని మొండికేస్తే ఎలా ?"

''ఆ బిల్లులో ఉన్న బీర్ బాటిల్సుకు నేను డబ్బివ్వాలా ? కట్నం బీర్ బాటిల్సు బిల్లుకోసమా ?"

''అవును తీసుకున్నప్పుడు యిచ్చితీరాల్సిందే !''

మాటా మాటా పెరిగింది. ఘర్షణగా మారింది. ఆమె పంతం తగ్గటంలేదు. పార్టీలో తనకు చిన్నతనమనిపిస్తుంది. అందరూ ఎగతాళిచేస్తారు. నవ్వుతారు. ఆ మహేంద్ర అందరికంటె చిన్నచూపు చూసి అవమానపరుస్తాడు.

''ఇంతకూ యిస్తారా ? యివ్వరా ?"

నా బడ్జెట్‌లో బీరు బాటిల్సు లేవు.

"ఇంతేనా ?''

''అంతేమరి.''

''దీని ఫలితం చవిచూస్తారు.''

దూకుడుగా వెళ్ళింది అక్కడనుంచి. అతడనుకున్నాడు పడగ్గదిలోకో లేక వంటయింట్లోకోనని.

మరికాసేపటికి దబ్బుమన్న చప్పుడు వినబడ్డది. రోడ్డుమీద పెద్దకేకలు.

అతడు ఏమిటో చూడాలని బాల్కనీమీదినుంచి తొంగిచూశాడు. ప్రతిమ తల చితికిపోయింది. రక్తం వరదలై పోతున్నది.

ఆ ఫ్లాట్సులో ఉన్నవాళ్ళేకాక ఆ బజారంతా పోగయింది. అందులో ప్రతిమ పార్టీవాళ్లంతా ఉన్నారు.

ఎవరో పోలీసుస్టేషనుకు ఫోనుచేశారు. పోలీసు వ్యాను వచ్చింది. ఇన్‌స్పెక్టరు అడిగినమీదట నలుగురూ నాలుగురకాలుగా చెప్పారు. అందులో ''వరకట్నం వేధింపు'' ఎక్కువగా వినబడ్డది.

రఘురామ్ కిందికి రాగానే ''ఆయనేనండి భర్త'' అని చూపించారు.

రఘురామ్‌ను ఇన్‌స్పెక్టరు అనేకరకాల ప్రశ్నలు వేశాడు.

"నాకేం తెలియదు. మీలాగా నేనూ యిప్పుడే చూస్తున్నాను. నాకంతా అయోమయంగా ఉంది. నేను ఆఫీసుఫైల్సు చూసుకుంటుండగా పెద్ద చప్పుడయింది. బాల్కనీలోనుంచి చూసి దిగివస్తున్నాను.''

ప్రతిమ దేహాన్ని పోస్టుమార్టమ్‌కు పంపించారు. రఘురామ్‌ను వ్యాను ఎక్కించుకున్నారు పోలీసువారు.

మళ్లీ పోగయిన జనం ఎవరికి తోచిన మాటలు వాళ్ళు అన్నారు. కొందరు వాదించుకున్నారు- మొత్తంమీద అందరూ కట్నంకోసం వేధింపేనని నిశ్చయం చేశారు.

''రామరామ. ఈ దారుణ హత్యలకు ముగింపెప్పుడో? డబ్బుకోసం వేధించి తీసుకురాలేదని పైనుంచి తోశేశాడు. కిరసనాయిల్‌తో కాల్చినా, పైనుంచి తోసినా ఒకటేగా ?"

"ఇంక ఆడపిల్లలు పెళ్ళిళ్ళుచేసుకోరు.''

"యువకులను ఏంచేసినా పాపంలేదు.''

''ఆడపిల్లకు సమానహోదా ఎప్పుడొస్తుందో ?''

గంటకు పైగా ఊహాగానాలు చేసిన ప్రేక్షకులు ఎవరితోవన వారు వెళ్ళి పోయారు.

పత్రికలలో ఘోరమంటూ వార్తలు. ఆఫీసులో రిమార్కులు. బంధు జాలంలో "రఘూ ఇంతేనా?'' అనే ప్రశ్నార్థకాలు. ఇచ్చిన కట్నానికి మూడింతలు కూతుళ్ళ పెళ్ళిళ్ళకని డబ్బు తీసుకున్న మామగారు కూడా రఘు అఘాయిత్యం చేశాడని తిట్టిపోశాడు.

రఘు చేయని తప్పుకు తల వంచుకుని, గోడవైపు తిరిగి కూర్చుని, యావజ్జీవ కారాగార శిక్షను అనుభవిస్తున్నాడు....